సాక్షి పెద్దపల్లి

బుధవారం: 17 ఏప్రిల్ 2024



రాములోరికి పూలదండలు

జ్యోతినగర్: మల్కాపూర్ శివపంచాయతన ఆంజనేయస్వామి ఆలయంలో రాములోరి కల్యాణం కోసం మహిళా భక్తులు పూల దండల తయారీలో నిమగ్నమయ్యారు.



ఫ్లైఓవర్ కోసం స్థల పరిశీలన

ఓదెల: కాజీపేట- బల్లార్షా మధ్య ఓదెల రైల్వేస్టేషన్ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రైల్వే శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమరాజు ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.6/24.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకావం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో పటిష్ట భద్రత



భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసే ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి కలెక్టరేట్‌లో చేపట్టిన ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చి, వెళ్లేదారులను పరిశీలించడంతోపాటు వాహనాల పార్కింగ్, మీడియా పాయింట్ ఏర్పాట్లపై ఆయన ఆరా తీశారు. ఈనెల 18నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కలెక్టరేట్‌లోనే సాగుతుందని ఆయన తెలిపారు. భద్రత కోసం కేంద్ర, సివిల్, ఆర్మ్‌డ్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ వివరించారు. డీసీపీ చేతన, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐలు కృష్ణ, సుబ్బారెడ్డి, ఎస్సై లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

నిర్వాసితులకు తీపికబురు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): న్యూమారేడుపాక గ్రామానికి చెందిన నిర్వాసితులకు హైకోర్టు తీపికబురు చెప్పింది. సుమారు 25 ఏళ్ల క్రితం న్యూమారేడుపాక గ్రామస్తులకు పునరావాసం కింద ప్రభుత్వం ప్లాట్లు పంపిణీ చేసింది. కానీ, వాటికి పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేసింది. దీంతో నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు.. విచారణ జరిపి పట్టాలు జారీచేయాలని తీర్పు చెప్పింది. ఈమేరకు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులు, పెద్దపల్లి, రామగుండం తహసీల్దార్లకు ఆదేశాలు జారీచేసిందని న్యాయవాది మేండ నాగరాజు మంగళవారం తెలిపారు. దీంతో నిర్వాసితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పత్తి ధర రూ.7,323

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.7,323గా నమోదైంది. కనిష్ట ధర రూ.6,251, సగటు ధర రూ.7,161గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

బల్దియాలో కంట్రోల్‌రూమ్

పెద్దపల్లిరూరల్: పట్టణంలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర సమస్యల పరిష్కారం కోసం బల్దియాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ మంగళవారం తెలిపారు. ఇందులో 63031 27484 ఫోన్‌నంబరు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పట్టణ ప్రజలు ఈ నంబరుకు ఫోన్‌చేసి సమాచారమిస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

గుండారం రిజర్వాయర్‌లోకి నీటి విడుదల



గుండారం రిజర్వాయర్‌కు జలకళ

కమాన్‌పూర్(మంథని): ఎస్సారెస్పీ డీ–8 కాలువ ద్వారా గుండారం రిజర్వాయర్‌లోకి మంగళవారం అధికారులు సాగునీరు విడుదల చేశారు. గుండారం, రాజాపూర్ శివారులోని పంటలు చేతికి వచ్చే సమయంలో సాగునీరు అందక ఎండిపోతున్నాయని మంత్రి శ్రీధర్ బాబుకు గుండారం మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, రైతులు విన్నవించారు. మంత్రి వెంటనే ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి సాగునీరు విడుదల చేయించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సిబ్బందికి శిక్షణ



సిబ్బంది, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎండీ వరుణ్‌కుమార్, ఎస్ఈ సుదర్శన్

పెద్దపల్లిరూరల్: జిల్లా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆపరేషన్, మెయింటనెన్స్ సిబ్బందికి మంగళవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. సీఎండీ వరుణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని, ఇందుకోసం బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సిబ్బందికి మాస్టర్ ట్రెయినర్ల ద్వారా వివిధ అంశాలు, సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు.



తల్లి లక్ష్మి, సోదరి స్రవంతితో సాయికిరణ్



ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు సివిల్స్‌లో మెరిశారు. కరీంనగర్‌కు చెందిన సహన మొదటి ప్రయత్నంలో టార్గెట్ రీచ్‌కాగా... జిల్లాలోని వెలిచాలకు చెందిన బీడీ కార్మికురాలి కొడుకు సాయికిరణ్ రెండో ప్రయత్నంలో లక్ష్యం చేరుకున్నారు.

సాయికిరణ్ 27.. సహన 739..

SUCCESS STORIES

- సివిల్స్‌లో మెరిసిన మనోళ్లు
- బీడీలు చుట్టి చదివించిన తల్లి
- పేదరికాన్ని జయించి లక్ష్యం చేరుకున్న సాయికిరణ్
- చేనేత కుటుంబం బిడ్డ కలసాకారం
- మొదటి ప్రయత్నంలోనే టార్గెట్ చేరుకున్న సహన

సాక్షిప్రతినిధి,కరీంనగర్/రామడుగు: ప్రతిభకు పేదరికం అడ్డు కానే కాదని మరోసారి రుజువైంది. తల్లిదండ్రులు కార్మికులైనా తాను కలెక్టర్ కావాలనుకున్న కలను ఎట్టకేలకు నెరవేర్చుకున్నారు.. పేదరికం కారణంగా కొలువు చేయాల్సి రావడం, కోచింగ్ తీసుకోకుండా సొంతంగానే ప్రిపేరయి రెండో ప్రయత్నంలోనే లక్ష్యం చేరుకున్నారు. సివిల్స్ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన నందాల సాయికిరణ్ విజయగాథను ఆయన సోదరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ స్రవంతి 'సాక్షి'కి వివరించారు. సాయికిరణ్ స్వగ్రామం రామడుగు మండలంలోని వెలిచాల. తల్లిదండ్రులు లక్ష్మి–కాంతారావు, సోదరి స్రవంతి ఉన్నారు. తండ్రి చేనేత కార్మికుడు, తల్లి బీడీ కార్మికులిగా పని చేస్తూ పిల్లల్ని పెంచారు. కుటుంబాన్ని బాగా చూసుకునేందుకు కాంతారావు మహారాష్ట్రలోని భీవండిలో చేనేత కార్మికుడిగా పని చేశారు. సాయికిరణ్ చిన్ననాటి నుంచి చదువులో ముందుండేవారు. ఐదో తరగతి వరకు సరస్వతి పాఠశాలలో చదివారు. ఆయన ప్రతిభను గుర్తించిన ఆ పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ కరీంనగర్‌లోని తేజస్విని పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించారు. 2012లో పదోతరగతి, ట్రినిటీ జూనియర్ కళాశాలలో 2014లో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేశారు. ఎన్‌ఐటీ వరంగల్‌లో సీటు సాధించిన సాయికిరణ్ 2018లో ఇంజినీరింగ్ పూర్తి చేయడంతోనే క్వాల్‌కమ్ కంపెనీలో ఉద్యోగం సాధించారు.

తండ్రి మరణించినా.. తల్లి అండతో..

ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతుండగానే సాయికిరణ్ తండ్రి 2016లో కేన్సర్ బారిన పడి మృతిచెందారు. దీంతో తల్లి లక్ష్మి కష్టపడి బీడీలు చుట్టి, తన ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. కూతురు స్రవంతి బీటెక్ పూర్తి చేసి, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో పని చేస్తున్నారు. సాయికిరణ్ 2018 నుంచి ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ పరీక్షలకు సిద్ధమయ్యారు. గతేడాది విఫలమైనా రెండోసారి ఆలిండియా 27వ ర్యాంకు సాధించారు. వీరి తల్లి లక్ష్మి ఇప్పటికీ బీడీలు చుడుతుందని గ్రామస్తులు తెలిపారు. కాగా, సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.



ప్రత్యేకత చాటుకున్న వెలిచాల..

గత పదేళ్లుగా ఉత్తమ గ్రామపంచాయతీగా పేరు పొందిన వెలిచాలకు ఇక్కడి అభివృద్ధి పనులపై స్టడీ టూర్ చేయడానికి దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పలువురు సివిల్ సర్వీస్ ప్రతినిధులు వచ్చి, వెళ్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న సాయికిరణ్ కష్టపడి చదివి, సివిల్స్ ర్యాంకు సాధించడంతో ఈ గ్రామం ప్రత్యేకత చాటుకుంది.



సహనకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



ఢిల్లీలో కోచింగ్ ...

కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక గీత–అనిల్ దంపతుల కూతురు సహన సివిల్స్ ఫలితాల్లో 739వ ర్యాంకు సాధించారు. ఆమె స్థానిక కెన్ క్రెస్ట్ స్కూల్లో పదోతరగతి, శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ జేఎన్టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. తర్వాత ఢిల్లీలో యూపీఎస్సీ కోచింగ్ తీసుకున్నారు. ప్రిలిమినరీ, మెయిన్స్ ఫలితాల్లో క్వాలిఫై అయ్యాక ఢిల్లీలో పలు మాక్ ఇంటర్వ్యూలకు అటెండయ్యారు. సహన తండ్రి అనిల్ కరీంనగర్‌లో పాత్రికేయుడిగా పని చేస్తున్నారు.

స్మితా సబర్వాల్ స్ఫూర్తి..

ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్ కలెక్టర్‌గా పని చేసిన స్మితా సబర్వాల్ తనకు స్ఫూర్తి అని సహన తెలిపారు. తాను పాఠశాలలో చదువుతున్నపుడు స్మితా మేడంలా కలెక్టర్ అవ్వాలని ఆ రోజుల్లోనే ఫిక్స్ అయ్యానని, ఆ కల నెరవేర్చుకునేందుకు తాను సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. దీనికి తల్లిదండ్రులు ఎంతగానో సహకరించారన్నారు. పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

15లోగా పనులు పూర్తిచేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మే 15వ తేదీ వరకు పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం అమ్మ ఆదర్శ కమిటీల చేపట్టే అభివృద్ధి పనులపై సమీక్షించారు. జిల్లాలోని 516 ప్రభుత్వ పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు 182 స్కూళ్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారని కలెక్టర్ తెలిపారు. మిగతా పనుల ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. పనులు పూర్తయిన వాటికి వారంరోజుల్లో బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ అన్నారు. ప్రతీ పాఠశాల వద్ద రూ.25వేల అత్యవసర నిధి ఉందని, ఆలోపు పనులకు కమిటీ సభ్యుల తీర్మానంతో పనులు చేసి బిల్లు పొందాలని సూచించారు. రూ.25వేల నుంచి రూ.లక్ష విలువైన పనులను ఎంపీడీవో, రూ.లక్షకు పైగా విలువైన పనులను జిల్లాస్థాయిలో పర్యవేక్షిస్తారని వివరించారు. జెడ్పీసీఈవో నరేందర్, డీఈవో మాధవి, డీఆర్డీవో రవీందర్, మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరస్వతి పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ డీఐజీ పర్యటన



మాట్లాడుతున్న డీఐజీ నందా

జ్యోతినగర్(రామగుండం): సౌత్ జోన్–2 డీఐజీ నందా మంగళవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని సీఐఎస్ఎఫ్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రాజెక్టులో చేపట్టిన భద్రతా చర్యలపై అధికారులతో ఆయన సమీక్షించారు. మల్కాపూర్ రోడ్డులోని సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్ పరిశీలించారు. ఈసందర్భంగా సీఐఎస్ఎఫ్ అధికారులు ఆయనకు గౌరవవందనం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కమాండెంట్ ముకేశ్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ నైమిశ్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ గంగయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ, కాలేజీలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని గంగయ్య అన్నారు. ఆ హక్కును వినియోగించుకుని సమర్థవంతమైన పాలకులను ఎన్నుకుందామని అన్నారు. స్వీప్ నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్, సీడీపీవో తదితరులు పాల్గొన్నారు.

నీటి కొరత తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశాలు

కోల్‌సిటీ(రామగుండం): వేసవి దృష్ట్యా రామగుండం నగరంలో నీటికొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో మంగళవారం ఆమె పర్యటించారు. తొలుత శారదానగర్‌లోని నగరపాలక సంస్థ ఉపరితల జలాశయం, సింగరేణి సంస్థ ఫిల్టర్ బెడ్ పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ, సింగరేణి అధికారులతో నీటి సరఫరా స్థితిపై సమీక్షించారు. ప్రస్తుతం నీటి సరఫరాలో ఇబ్బందులేమీలేవని కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ వివరించారు. వేసవి తీవ్రత దృష్ట్యా భవిష్యత్‌లో సమస్య తలెత్తితే ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలని అరుణశ్రీ ఆదేశించారు. నగరపాలక సంస్థ ట్యాంకర్లకు కూడా సింగరేణి ఫిల్టర్‌బెడ్ నుంచి నీళ్ల ఇచ్చేందుకు ఆ సంస్థ అధికారులు సంసిద్ధత వ్యక్తం చేశారని తెలిపారు. నీరు వృథాగా పోకుండా పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలని, బోరుబావులను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ చిన్నారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుచరణ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జమీల్, సింగరేణి అధికారి యుగందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ బండారం బయటపడింది'



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

మంథని: ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన బండారం నాలుగు నెలల్లోనే బయటపడిందని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆధ్వర్యంలో మంగళవారం పెద్దపల్లి పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. గతంలో తాత, తండ్రి పోటీ చేశారని, ఇప్పుడు మరో వారసుడిని తెరపైకి తెచ్చారని కొప్పుల విమర్శించారు. దళితులకు ద్రోహం చేసిన పార్టీ కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజావసరాలు తీర్చామని వివరించారు. రిజర్వేషన్లు వినియోగించుకుని కాకా కుటుంబం ఆస్తులు కూడబెట్టుకుందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. ఎంపీ సీట్లు గెలిస్తే చిన్నజిల్లాలను తొలగిస్తారని, అభివృద్ధికి ఆమడ దూరంలోకి నెట్టివేస్తారని మధు విమర్శించారు. ఈనెల 19న పెద్దపల్లిలో కొప్పుల ఈశ్వర్ నామినేషన్ దాఖలు కార్యక్రమం ఉంటుందని, నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తాలు పేరిట ఇబ్బంది పెడితే చర్యలు

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: తాలు, తరుగు పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు పంటకు నీళ్ల రావని అబద్ధపు మాటలు చెప్పి రైతులను మోసం చేయాలని చూశారని ఆరోపించారు. కానీ, చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వరి కోతలు మొదలయ్యాయని, ఐకేపీ, పీఏసీఎస్ తదితర కేంద్రాల్లో వడ్ల కొనుగోళ్ల ప్రారంభించారని అన్నారు. ప్రభుత్వం ప్రతీగింజ కొనుగోలు చేస్తుందని, ఈవిషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన వైఖరితో ఉన్నారని వెల్లడించారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ప్రతీరైతు సంతోషంగా ఉండాలని, అన్నదాతను కన్నీటి పెట్టిస్తే ఎవరినీ వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించేందుకు వెనకాడబోమని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రతి గ్రామంలో పర్యటించి రైతులకు ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

ప్రజాసంక్షేమానికి ప్రణాళికలు

జ్యోతినగర్(రామగుండం): నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. కృష్ణానగర్–నర్రాశాలపల్లె రోడ్డు విస్తరణ పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. ప్రజాభివృద్ధి విషయంలో వెనుకడువేసే ప్రసక్తే లేదని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు కాలనీవాసులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలిపాక సుజాత, ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, నాయకులు విక్రమసింహారావు, ముక్కా సుదర్శన్ పాల్గొన్నారు.

నీడపట్టున ఉండండి

పెద్దపల్లిరూరల్: 'వేసవి ఆరంభం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. వాటి ధాటికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లేవారు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. అందుకే జిల్లావాసులు మధ్యాహ్నం ఇళ్లలోనే ఉండాలి. అత్యవసరమైన పనుల కోసం బయటకు వెళ్లాల్సి వస్తే చాలాజాగ్రత్తలు తీసుకోవాలి. సమతుల ఆహారం తీసుకోవాలి' అంటున్నారు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్. ఎండల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలను ఆయన 'సాక్షి'కి వివరించారు. ఆయన మాటల్లోనే..



- ఎండలతో జాగ్రత్త
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్

సాక్షి : ఎండల తీవ్రత ఎలా ఉంది?

డీఎంహెచ్‌వో : ఈసారి ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయి. సాధారణ ఉష్ణోగ్రతలను మించి నమోదు అవుతున్నాయి.

సాక్షి : వేసవిలో ఎలాంటి పదార్థాలు తీసుకోవద్దు, ఎందుకు?

డీఎంహెచ్‌వో : శీతలపానీయాలు, టీ తీసుకోవద్దు. చల్లగా లభిస్తాయని అందుబాటులో ఉన్నవి తాగితే ఇబ్బందులు వస్తాయి.

సాక్షి : తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు ఏమిటి?

డీఎంహెచ్‌వో : వీలైనంత వరకు నీళ్ల ఎక్కువగా తాగాలి. మజ్జిగ, ఓఆర్ఎస్ తాగడం ఎంతోమేలు. పండ్లు, పండ్ల రసాలు తీసుకోవచ్చు. పుచ్చకాయ, ఆరంజ్ తినాలి.

సాక్షి : ఎలాంటి దుస్తులు ధరించాలి?

డీఎంహెచ్‌వో : ధరించే దుస్తులు ఒదులుగా ఉండాలి. అవి లేతరంగుల్లో ఉంటే మేలు.

సాక్షి : తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సివస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

డీఎంహెచ్‌వో : వీలైనంత వరకు నీడపట్టున ఉండడమే మేలు. తప్పనిసరైతే తల, ముక్కు భాగాన్ని కాటన్‌గుడ్డతో చుట్టుకోవాలి. తద్వారా ఎండ నుంచి రక్షణ ఉంటుంది.

సాక్షి : ప్రత్యేకంగా మహిళలకు ఇచ్చే సూచనలు ఏమిటి?

డీఎంహెచ్‌వో : వేసవిలో మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 3గంటల మధ్య వంట చేయవద్దు. పొయ్యి వద్దకు వెళ్తే వేడి అధికంగా ఉండి అనారోగ్యానికి గురవుతారు.

సాక్షి : వడదెబ్బ బారిన పడితే ఏంచేయాలి?

డీఎంహెచ్‌వో : వడదెబ్బకు గురైన వారిని నీడకు తీసుకెళ్లాలి. గాలి సోకేలా ఉంచాలి. తడిగుడ్డతో తరచూ తుడవాలి. శరీర ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి వచ్చేంత వరకూ ఈ పనిచేయాలి. ఆ తర్వాత వైద్యులను సంప్రదించాలి.

సాక్షి : జిల్లాలో ఇప్పటివరకు వడదెబ్బ మరణాలు సంభవించాయా?

డీఎంహెచ్‌వో : ఇప్పటివరకు వడదెబ్బ మరణాలు సంభవించలేదు. రెండురోజుల క్రితం ముత్తారం మండలంలో ఓ కేసు నమోదైనట్లు సమాచారం అందింది. కానీ, విచారణ తర్వాత అది వడదెబ్బకాదని తేలింది.

సాక్షి : వేసవిలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారా?

డీఎంహెచ్‌వో : జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశాం. ప్రతీగ్రామం, మున్సిపాలిటీలో అవగాహన కల్పిస్తున్నాం. ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సలహాలు, సూచనలపై మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నాం. ఉపాధి పనులు చేసే కూలీలు ఉదయం 11గంటలకల్లా ఇళ్లకు చేరేలా చూడాలని అధికారులకు సూచించాం.

సాక్షి: మందులు అందుబాటులో ఉన్నాయా?

డీఎంహెచ్‌వో : ఓఆర్ఎస్ పాకెట్లను ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచాం. జిల్లావ్యాప్తంగా ఆశ వర్కర్లతోపాటు వీలైనంతవరకు చలివేంద్రాల వద్ద కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

క్లుప్తంగా

ఎన్నికల్లో సత్తా చాటుతాం



మాట్లాడుతున్న చందర్

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుని సత్తా చాటుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. కార్పొరేషన్ ఒకటో డివిజన్‌లో ముఖ్య నాయకులతో మంగళవారం ఆయన రౌండ్ టేబుల్ సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎంతో భరోసా ఉండేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు, వృద్ధాప్య తదితర సంక్షేమ పథకాల అమలులో విఫలమైన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్పొరేటర్ ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, రాయదండి మాజీ సర్పంచ్ ధర్మాజి కృష్ణ, క్రియాశీలక ప్రతినిధులు శివరాత్రి గంగాధర్, మాడిశెట్టి రవి, అత్హరొద్దీన్, వేణుగోపాల్, నర్సింగ్, పల్లికొండ నరేశ్, దాముక వంశీ, అనిల్, కుమ్మరి మొండయ్య, కొమురయ్య, పద్మయ్య, వేల్పుల అంజి పాల్గొన్నారు.

'సొంతింటి కల నెరవేరుస్తాం'

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన బీఎంఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల ఆదాయ పన్ను, సొంతింటి కల, మెరుగైన వైద్యం, విద్య, నూతన బొగ్గుగనుల ప్రారంభ దిశగా పోరాటానికి యూనియన్ సిద్ధంమైందని తెలిపారు. భూగర్భ గనుల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను వినియోగించాలని డిమాండ్ చేశారు. భూగర్భ గనుల్లో వెంటిలేషన్ సదుపాయం మెరుగుపర్చేందుకు యాజమాన్యం సరికొత్త టెక్నాలజీ వినియోగించాలని కోరారు. ఈసారి రూ.37 వేల కోట్ల టర్నోవర్ వచ్చిందని యాజమాన్యం వెల్లడించిందని, అందులో 40శాతం లాభాల వాటాను కార్మికులకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పలువురు బీఎంఎస్‌లో చేరగా కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. నాయకులు మాదాసి రవీందర్, రాజు, ఆకుల హరిణ్, అరుకాల ప్రసాద్ మామిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కరుగుతున్న ఎర్రమట్టి గుట్టలు

- ఆగని మట్టి అక్రమ రవాణా
- రాత్రిళ్లు జోరుగా తరలింపు

జూలపల్లి(పెద్దపల్లి): ఎర్రమట్టికి ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. ఇళ్లు, భవనాల్లో బరంతి కోసం ఈ మట్టిని వినియోగిస్తున్నారు. అంతేకాదు.. రహదారుల నిర్మాణంతోపాటు నర్సరీలు, నివాసాల్లో మొక్కల పెంపకానికీ ఎర్రమట్టి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో అక్రమార్కుల కన్ను దీనిపై పడింది. జిల్లామొత్తంగా ఒక్క జూలపల్లి మండలంలోనే నాణ్యమైన ఎర్రమట్టి ఉంది. అందుకే స్మగ్లర్లు జేసీబీల సాయంతో తవ్వుతూ ట్రాక్టర్లు, లారీల్లో అక్రమంగా తరలించుకుపోతున్నారు.

400 ఎకరాల్లో విస్తరించిన గుట్టలు

జిల్లాలో ఎక్కడా లభించని ఎర్రమట్టి జూలపల్లి మండలం పెద్దాపూర్, తెలుకుంట, నాగులపల్లె, చీమలపేట గ్రామ శివారుల్లో లభిస్తోంది. ఇక్కడి సుమారు 400 ఎకరాల్లో విస్తరించి ఉన్న గుట్టల్లో నాణ్యమైన ఎర్రమట్టి ఉంది. అక్రమార్కుల కన్ను ఇక్కడ పడింది. స్థానికులను మచ్చిక చేసుకుంటున్న వ్యాపారులు.. గుట్టల్లోని ఎర్రమట్టిన జేసీబీలతో తవ్వి టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోతున్నారు.

లారీ లోడ్‌కు రూ.6వేలు..

వాల్టాను అతిక్రమిస్తున్న అక్రమార్కులు.. రాత్రివేళ, సెలవు రోజుల్లో గుట్టల్లోంచి ఎర్రమట్టి తరలించుకుపోతున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. లారీ లోడ్‌కు రూ.6వేలు, ట్రాక్టర్ లోడ్‌కు రూ.3వేల చొప్పున తీసుకుంటూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. తద్వారా అటు గ్రామపంచాయతీకి, ఇటు ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్ము అక్రమార్కుల చేతులకు వెళ్తోంది.



కరిగిపోతున్న తెలుకుంట ఎర్రమట్టిగుట్ట

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు..

వాల్టా ప్రకారం అనుమతి పొంది.. నిర్దేశిత కొలతల ప్రకారం మట్టి తీయాతుండగా.. అడిగే వారు లేరన్న ధీమాతో వ్యాపారులు ఎర్రమట్టి తరలిస్తున్నారు. అయితే, వారం క్రితం రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసుల సాయంతో సీజ్ చేశారు. భూగర్భ గనుల శాఖ అధికారులకు అప్పగించారు. అయితే, సహజ సంపదను కాపాడాల్సిన కొందరు అధికారుల ఉదాసీనతతో విలువైన ఎర్రమట్టి తరలిపోతోందనే విమర్శలు వస్తున్నాయి.

గుట్టలను కాపాడాలి



ఎవరికీ అనుమానం రాకుండా రాత్రివేళ గుట్టల వెనకాల ఎర్రమట్టి తీసి తరలించుకుపోతున్నారు. పట్టణాలకు తీసుకెళ్లి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. దీంతో ఎర్రమట్టి గుట్టలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గుట్టలను కాపాడాలె.

– మంద లక్ష్మణ్, తెలుకుంట

అక్రమార్కులపై చర్యలు



అధికారుల నుంచి అనుమ తి తీసుకోకుండా గ్రా మాల్లోని ఎర్రమట్టి గుట్ట లను తవ్వితే చర్యలు తీసుకుంటాం. మట్టిని రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. వాల్టా ప్రకారం కేసులు నమోదు చేస్తాం. బా ధ్యులకు పెద్దమొత్తంలో జరిమానా విధిస్తాం.

– బషీరుద్దీన్, తహసీల్దారు, జూలపల్లి

కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న సీతారామయ్య

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కార్మిక హక్కుల సాధన లక్ష్యంగా ఏఐటీయూసీ పోరు సాగిస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధ) రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు పర్మినెంట్ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి కమ్యూనిటీహాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ శ్రేణుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ రోజే కార్మికులకు హెల్త్‌కార్డులు అందజేసేలా సింగరేణి దృష్టికి తీసుకెళ్లామన్నారు. 2018 నుంచి ఇప్పటివరకు అన్‌ఫిట్ అయిన కార్మిక వారసుల వయసు 35ఏళ్లు నిండిన తర్వాత కూడా ఉద్యోగాలు ఇవ్వాలని విన్నవించగా, జూన్ 4 తర్వాత అమలు చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. ఇంక నుంచి మూడు నెలలకోసారి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తామని అన్నారు. యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, నాయకులు వైవీ రావు, ఉమామహేశ్వర్, శ్యాంసుందర్, రాజారాత్నం, స్వామి, బుర్ర తిరుపతి, గోవర్ధన్, జిగురు రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, రవికుమార్ పాల్గొన్నారు.

అడుగంటిన ఆశలు

- చివరి తడి అందక ఎండి వరి

కమాన్‌పూర్(మంథని): ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట చేతికి అందివచ్చే సమయంలో సాగునీటి సమస్య ఎదురైంది. కళ్లెదుటే పంట ఎండిపోతుండంతో రైతు కన్నీటిపర్యంతమవుతున్నాడు. గత్యంతరం లేక ఎండిన పంటను పశువులు, గొర్రెలకు మేతగా వేస్తున్నాడు. పంట దెబ్బతిని, పెట్టిన పెట్టుబడి రాక.. చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక దిగాలు చెందుతున్నాడు. పెంచికల్‌పేట, జూలపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఈ యాసంగిలో వరి వేశారు. ప్రస్తుతం పంట చేదికి వచ్చేస్థితికి చేరింది. ఈసమయంలోనే కాలువ నీరు రాక, బోర్లు, వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పంట ఎండిపోయింది. తనకున్న నాలుగు ఎకరాలతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకున్న పెంచికల్‌పేటకు చెందిన పోశం.. యాసంగిలో వరి సాగు చేశాడు. మొదట్లో పంట మంచిగా వచ్చింది. దానినిచూసి మురిసిపోయాడు. ఇంకో రెండు తడులనీరు పెడితే పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. కానీ, కాలువ నీరు రావడం లేదు. మూడు బోర్లలో భూగర్భ జలాలు అడుగంటాయి. కళ్లముందే పంట ఎండిపోయిందని పోశం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



పెంచికల్‌పేటలో ఎండిన వరి మేస్తున్న పశువులు

చిన్నారిని చిదిమేసిన స్కూల్ వ్యాన్

- తల్లిని వెతుక్కుంటూ వెళ్లి.. మృత్యుఒడికి
- కుమారుడిని బడికి పంపించేందుకు వెళ్లిన తల్లి
- టైర్ కింద పడి ఏడాదిన్నర చిన్నారి దుర్మరణం
- జగిత్యాల జిల్లా మల్యాల మండం మద్దుట్లలో విషాదం



స్కూల్ వ్యాన్ వద్ద గుమిగూడిన ప్రజలు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్యాల(చొప్పదండి): కుమారుడిని స్కూల్ వ్యాన్ ఎక్కించేందుకు వెళ్లిన తల్లిని వెతుక్కుంటూ వెళ్లిన చిన్నారి అదే స్కూల్ వ్యాన్ కిందపడి అక్కక్కడికే మృతిచెందిన సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం మద్దుట్లలో చోటుచేసుకుంది. మండలంలోని మద్దుట్లకు చెందిన ఎండీ.హసీనా, రజాక్‌కు సాజిత్ (4), కూతురు అరిబా (ఏడాదిన్నర) ఉన్నారు. సాజిత్ రామన్నపేటలోని సరస్వతి విద్యానికేతన్‌లో చదువుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం కూడా కూతురు అరిబాను ఇంట్లో ఉంచి.. సాజిత్‌ను స్కూల్ వ్యాన్ ఎక్కించేందుకు తల్లి హసీనా వెళ్లింది. అరిబా తల్లిని వెతుకుతూ స్కూల్ వ్యాన్ వద్దకు చేరుకుంది. తల్లి కోసం స్కూల్ బస్ ముందువైపు నుంచి వెళ్లడం.. గమనించకుండా డ్రైవర్ ముందుకు కదలడంతో చిన్నారి టైర్ల కింద పడిపోయింది. తలపైనుంచి టైరు వెళ్లడంతో మెదడు చితికిపోయింది. స్థానికులు తండ్రి రజాక్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన చిన్నారిని ఆటోలో జగిత్యాల ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు.



అరిబా(ఫైల్)

పది నిమిషాలు ముందు వచ్చి ఉంటే..

అరిబా తండ్రి రజాక్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతిరోజూ కూరగాయలు తీసుకొచ్చేందుకు వేకువజామునే జగిత్యాల వెళ్తాడు. వచ్చాక సాజిత్‌ను స్కూల్‌కు పంపిస్తాడు. ఎప్పటిలాగే జగిత్యాల వెళ్లిన రజాక్‌కు కాస్త ఆలస్యమైంది. దీంతో హసీనా సాజిత్‌ను వ్యాన్ ఎక్కించేందుకు వెళ్లింది. అంతలోనే ఘోరం జరిగిపోయింది. తాను ముందుగొచ్చినా కూతురు బతికేదని రజాక్ రోదించిన తీరు కలిచివేసింది. రజాక్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన స్కూల్ వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

శుభకార్యానికి వెళ్తొస్తూ మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ యువకుడి మృతి
- కోర్టు కేసు ఉండటంతో 2 నెలల కిందటే దుబాయ్ నుంచి రాక
- నాగయ్యపల్లెలో విషాదం



సాయికుమార్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఓ కేసులో నిందితుడిగా ఉన్న ఓ యువకుడు దుబాయ్ నుంచి వచ్చిన 2 నెలలకే మృత్యుఒడికి చేరాడు. శుభకార్యానికి వెళ్లొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలంలోని నాగయ్యపల్లెకు చెందిన సెట్టుపల్లి లక్ష్మి–వెంకటేశ్ దంపతుల కుమారుడు సాయి ఉరఫ్ సాయికుమార్. రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అంతకుముందు ప్రేమ పెళ్లి చేశాడని ఇతనిపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇది కోర్టులో ట్రయల్‌కు రావడంతో సాయికుమార్ తల్లిదండ్రులు అతన్ని దుబాయ్ నుంచి రమ్మనడంతో 2 నెలల క్రితమే వచ్చాడు. సోమవారం చందుర్తి మండలం జోగాపూర్‌లోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా మూడపల్లి శివారులోని నర్సింగాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి, మైలురాయిపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

కోర్టు కేసు ముగిస్తే తిరిగి దుబాయ్‌కి..

కోర్టులో కేసు ముగిస్తే సాయికుమార్ తిరిగి దుబాయ్ వెళ్లేవాడు. కానీ, అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటంతో అతని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి ఒక అక్క, చెల్లి ఉన్నారు. ఏకైక కుమారుడు చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు తమకు దిక్కెవరంటూ రోదించిన తీరు కంటతడి పెట్టించింది.

ఆలయాలు ముస్తాబు



శ్రీసీతారాముల కల్యాణం కోసం జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ హనుమాన్ ఆలయం, శాంతినగర్ రామాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాత్రివేళ ఆలయాలు విద్యుత్ వెలుగుల్లో మిరమిట్లు గొల్పుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

చీమలపేటలో ఇద్దరికి డెంగీ



వైద్య శిబిరంలో మందులు ఇస్తున్న వైద్యాధికారి సంపత్‌రెడ్డి

జూలపల్లి(పెద్దపల్లి): మండల ప్రజలు వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్ రెడ్డి సూచించారు. చీమలపేట గ్రామంలో మంగళవారం వైరల్ జ్వరాల సర్వేతో పాటు పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, 78 మంది జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఎగుర్ల గట్టయ్య, రాజులకు డెంగీ జ్వరంగా నిర్ధారణ అయ్యింది. దీంతో గ్రామంలో పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఎస్‌యూవో బి.ఆంజయ్య, హెచ్‌వీ వసంత, ఎంఎల్‌హెచ్‌పీ అంజలి, ఏఎన్ఎం అరుణ, హెచ్‌ఏ అనంతరావు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో తనిఖీ

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్‌లో డీలర్ వి.శారదకు చెందిన రేషన్ దుకాణంలో సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం తనిఖీ నిర్వహించారు. బియ్యం నిల్వలు పరిశీలించారు. 11 క్వింటాళ్ల బియ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి, డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున్ రావు(పెద్దపల్లి), శ్రీనివాస్ (మంథని), సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ రాథోడ్(మంథని) తదితరులున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశామని గోదావరిఖని టూటౌన్ సీఐ రవీందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. యైటింక్లయిన్ కాలనీ వారసంతలో ఈ నెల 15న గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వారు వెంటనే అక్కడికి వెళ్లి, అనుమానాస్పదంగా తిరుగుతున్న మచ్చుపేటకు చెందిన ఇరికిల్ల రఘును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను కొంతకాలంగా గుంటూరుపల్లికి చెందిన శివ రూట్ వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ యైటింక్లయిన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. పూర్తి వివరాలు తెలుసుకున్న పోలీసులు మంగళవారం గుంటూరుపల్లికి వెళ్లి, చిలుముల మధును, గోదావరిఖని విఠల్‌నగర్‌లో వినోద్ ఖన్నా, తిలక్ నగర్‌లో గుజ్జుల శివప్రసాద్, సెంటినరీకాలనీలో మంథని చైతన్య అలియాస్ బన్నీ, ఆరెల్లి సాయి రేవంత్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.117 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఆరుగురినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి దొంగలు?

జగిత్యాల క్రైం/సారంగాపూర్: సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో 15 రోజుల క్రితం అంబులెన్స్‌లో నుంచి 70 కిలోల గంజాయి మాయమైంది. దొంగలను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సారంగాపూర్‌కే చెందిన నలుగురు యువకులు పథకం ప్రకారం ఠాణా వెనకాల నిలిపి ఉన్న అంబులెన్స్‌లో గంజాయి ఉన్నట్లు గుర్తించి, పోలీసులు నిద్రిస్తున్న సమయంలో చోరీ చేసినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న వారు గంజాయి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు, వారి వద్ద నుంచి కొంత గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. అయితే, గంజాయి మాయంపై రాష్ట్ర ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారని, బాధ్యులపై సస్పెన్షన్ వేటు పడుతుందన్న తరుణంలో దొంగలు పట్టుబడటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నట్లు సమాచారం. పూర్తి సమాచారం సేకరించి, రెండు, మూడు రోజుల్లో వారిని ఉన్నతాధికారుల ఎదుట హాజరుపర్చనున్నట్లు తెలిసింది.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): అదనపు వరకట్నం తీసుకురావాలంటూ ఓ వివాహితను వేధిస్తున్న ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని కోరపల్లికి చెందిన పల్లె నిఖిలను హైదరాబాద్‌కు చెందిన గోడల శివచరణ్‌కు ఇచ్చి 2022లో వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఆరు నెలల వరకు వీరి కాపురం సవ్యంగా సాగింది. తర్వాత హైటెక్ సిటీలో ఇల్లు, రూ.80 లక్షల కట్నం అదనంగా తీసుకురావాంటూ భర్త, అత్తామామ వేధించడం ప్రారంభించారు. దీంతో నిఖిల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నగదు పట్టివేత

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రాఘవపేట శివారులో మంగవారం సాయంత్రం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.98 వేలు పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. సదరు వ్యక్తి సరైన పత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకొని, గ్రీవెన్స్ సెల్‌కి అప్పగించినట్లు పేర్కొన్నారు. కానిస్టేబల్ రాజేశ్ తదితరులున్నారు.



డబ్బులు చూపుతున్న పోలీసులు

శుభలేఖలు పంచేందుకు వచ్చి ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగిత్యాల క్రైం: బంధువులకు శుభలేఖలు పంచేందుకు వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్సెట్‌పేట్ బోయవాడకు చెందిన బోరె మహేశ్(21) తన మిత్రుడు జిన్న శ్రీకాంత్‌తో కలిసి మంగళవారం శుభలేఖలు పంచేందుకు మల్యాల మండలం లంబాడిపల్లికి బైక్‌పై వచ్చాడు. సాయంత్రం తిరిగి లక్సెట్‌పేట్ వెళ్తుండగా జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై వెనక నుంచి వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న మహేశ్‌కు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీకాంత్ గాయపడగా స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

హరిత సదనం తొలగింపుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

గోదావరిఖని: స్థానిక కోదండ రామాలయంలోని హరత సదనం తొలగింపుపై చీఫ్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎన్‌జీవో జీపీపీ పీపీజీ అధ్యక్షుడు ఎల్.రాజయ్య మంగళవారం తెలిపారు. కోదండ రామాలయంలో బుధవారం నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణం కోసం 23ఏళ్లుగా కొనసాగుతున్న హరిత సదనాన్ని కూల్చివేసి నష్టం కలిగించారని పేర్కొన్నారు. గతంలోనే సింగరేణి యాజమాన్యం 39 గుంటల స్థలాన్ని తమకు కేటాయించిందని గుర్తుచేశారు. ఇందులో కొన్ని ఔషధమొక్కలు ఉన్నాయన్నారు. వాటిని తొలగించిన సింగరేణి యాజమాన్యం, మున్సిపల్ అధికారులు, కోదండరామాలయం ఎండోమెంట్ అధికారులపై చర్య తీసుకోవాలని ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ముఖ్య ఎన్నికల కమిషనర్‌తో పాటు సీఎం, అధికారులకు కూడా ఫిర్యాదులు చేసినట్లు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అన్నపూర్ణ కాలనీకి చెందిన మడిపల్లి రవీందర్ ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం షిఫ్టుకు సైకిల్‌పై వెళ్తూ రోడ్డు దాటుతుండగా కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో రవీందర్‌కు గాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.